క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో పారిశుద్ధ్య పనులను మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం పరిశీలించారు. కాలనీలో నీటి సరఫరా చేసే మోటార్ వరదల కారణంగా పాడవడంతో కొత్తది ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ (జనరల్) డాక్టర్ ఎ.మహేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హి'కి ప్రణాళిక సిద్ధం చేయండి

స్వచ్ఛతే సేవగా భావించి 'స్వచ్ఛతా హి సేవ' నినాదంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలకనుగుణంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఓ ప్రకటనలో ఆదేశించారు. బుడమేరు వరదల తర్వాత నగర ప్రజలకు స్వచ్ఛతలో సహాయపడుతూ, ప్రజలను, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులతో స్వచ్ఛత కార్యక్రమాలు రూపొందించేటట్లు ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోండి



పటమట(విజయవాడతూర్పు): ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్టెల్లా కళాశాల ప్రతినిధి ఇన్నా సియా అన్నారు. స్టెల్లా కళాశాల అధ్యాపక, పూర్వ విద్యార్థినులు మేనేజ్మెంట్ విద్యార్థులు, విశ్రాంత అధ్యాపకులు శుక్రవారం వరద బాధితులకు పాయకాపురంలో దుస్తులు, సామగ్రి, క్లీనింగ్ మెటీరియల్స్, బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్, డేటల్ మోపింగ్ స్టిక్స్ కొవ్వొత్తులు దుప్పట్లు, టవల్స్ తదితర వస్తువులు అందించారు. అనంతరం కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వచ్ఛత పక్వాడ నిర్వహించి వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హారిక, సుబ్బయ్య, లావణ్య, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉష కుమారి, ఇంటర్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ఇతర అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు

కాచిన నీటినే తాగండి

పటమట(విజయవాడతూర్పు): వరద ప్రభావిత ప్రాంతాల్లో నగరపాలక సంస్థ సరఫరా చేస్తున్న నీటిని కాచి చల్లార్చి వినియోగించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీరు వాడుకోవడానికేనని, 62,63,64 డివిజన్లలో లోతట్టు ప్రాంత ప్రజలు మరో రెండు రోజులవరకు తాగునీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. త్వరలోనే తాగునీటిని పునరుద్ధరిస్తామని ఆయన పేర్కొన్నారు.

తూనికుంట్ల సేవలు అపూర్వం



వన్టౌన్(విజయవాడపశ్చిమ): విభిన్న రంగాల్లో కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎస్కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. అమెరికాలోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ అమెరికా నుంచి గౌరవ డాక్టరేట్ను అందుకున్న తూనికుంట్ల శ్రీనివాసుకు ఆ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పత్రాలను శుక్రవారం అందుకున్నారు. ఈ సందర్భంగా కేబీఎన్ కళాశాల అడ్మినిస్ట్రేటర్స్ ఆధ్వర్యంలో తూనికుంట్ల శ్రీనివాసు అభినందన కార్యక్రమాన్ని హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ జూనియర్ కళాశాల ఇన్ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టి విజయబాబు, కేబీఎన్ షైన్ డైరెక్టర్ టీ నరేంద్రకుమార్, కళాశాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్ శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

నిరాశ్రయులకు వాసవి క్లబ్ల వితరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ప్రభావంతో నిరాశ్రయులుగా మారిన బాధితులకు వాసవి క్లబ్బులు నోట్ పుస్తకాలు, స్టీల్ కంచాలు, గ్లాసులు, దుప్పట్లు, లుంగీలు, టవల్స్, మహిళలకు చీరలను వితరణ చేశాయి. జిల్లా గవర్నర్ (215) ప్రవీణ్ కుమార్, అంతర్జాతీయ నాయకులు సూర్యప్రకాష్ , సభ్యుల సౌజన్యంతో పశ్చిమ నియోజకవర్గంలోని రాజరాజేశ్వరిపేటలో నగరపాలక సంస్థకు చెందిన పాఠశాలలో శుక్రవారం పంపిణీ కార్యక్రమం జరిగింది. వాసవి క్లబ్బుల అంతర్జాతీయ మాజీ అధ్యక్షులు వేములు హజరత్తయ్య గుప్తా, గాయత్రి, ఇతర జిల్లాల (212, 203) గవర్నర్లు సతీష్, గణేష్ పర్యవేక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు, ఎంతఊట సాంబశివరావు.. వాసవి ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.



వరద నీటిలో బట్టలు ఉతుకుతున్న మహిళలు, స్నానాలు చేస్తున్న చిన్నారులు



వరద నీటిలో వాహన చోదకుల కష్టాలు



జక్కంపూడి పొలాల్లో ఇంకా కదలని వరద నీరు

వీడని వరద కష్టాలు

- జక్కంపూడి కాలనీలో శివారు బ్లాకువాసుల అవస్థలు
- వాటర్ ట్యాంకర్ల కోసం పడిగాపులు
- వరద నీటిలోనే అన్నీ...!

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జక్కంపూడి కాలనీలో బుడమేరు వరద తగ్గుముఖం పట్టినా కాలనీవాసుల కష్టాలు మాత్రం వీడటం లేదు. తిండే కాకుండా ఇల్లు, ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకునేందుకు సరైన నీటి వసతి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీట మునిగిన ఇళ్లను శుభ్రం చేసుకునేందుకు ప్రభుత్వం ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నా అవి కాలనీ శివారు బ్లాకులకు చేరడం లేదు. కాలనీలోని 1 నుంచి 20వ బ్లాకుల్లో నివసించే వారికి ఎటువంటి సాయం అందడం లేదని వాపోతున్నారు. మురుగు, బురదతో ఉన్న ఇళ్లను ఇంటి ముందు ఉన్న వరద నీటిలోనే శుభ్రం చేసుకుంటున్నారు. అంతే కాకుండా దుస్తులను, దుప్పట్లను ఉతుక్కోవడానికి వరద ప్రవాహం అధికంగా ఉన్న పాముల కాల్వ రోడ్డుకు తరలి వెళ్తున్నారు.



చుట్టూ మురుగు, వరద నీటిలో రామరాజ్యనగర్ హెల్త్ క్లినిక్

చెత్త, వ్యర్థాల మధ్య జీవనం

రోడ్డుపై ఎక్కడ చూసినా చెత్త, వరద నీటితో కొట్టుకు వచ్చిన వ్యర్థాలతో ఇంటి వద్ద ఉండలేకపోతున్నామని మహిళలు పేర్కొంటున్నారు. కనీసం బట్టలను శుభ్రం చేసుకునేందుకు రోడ్డుపైకి వస్తే కాస్త వాతావరణమైనా మారుతుందని వారు పేర్కొంటున్నారు. పాముల కాల్వ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీటిలోనే దుస్తులను శుభ్రం చేసుకుంటున్నారు. చిన్నారులు, మహిళలు ఆ నీటిలోనే స్నానాలు చేస్తున్నారంటే కాలనీలో రక్షిత నీటి సరఫరా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

పాముల కాల్వ రోడ్డుపై అంతరాయం

వైవీ రావు రింగు నుంచి పాముల కాల్వ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై అడుగున్నర మేర వరద నీరు పారుతుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వైవీ రావు రింగ్ నుంచి పైపుల రోడ్డు వైపునకు వెళ్లే ఇన్నర్ రింగ్ రోడ్డులో ఏడు చోట్ల గండ్లు కొట్టారు. దీంతో జక్కంపూడి కాలనీ, పైపుల రోడ్డు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తగా నిర్మించిన హైవే మీదగా, పాయకాపురం, కండ్రిక వెళ్లే వాహన చోదకులకు వరద నీటితో ఇబ్బందులు ఎదురయ్యాయి. హైవే వద్ద పెద్ద గోతులు ఉండటం, వరద నీటి ప్రవాహం భారీగా ఉండటంతో ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులకు గురవడం కనిపించింది.

వరద ముంపులోనే విలేజ్ హెల్త్ క్లినిక్

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద వచ్చి వెళ్లి పదమూడు రోజులైనా గొల్లపూడి పంచాయతీ పరిధిలోని రామరాజ్యనగర్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఇంకా వరద నీటి ముంపులోనే ఉంది. పేరుకు పంచాయతీ పరిధి అయినా మున్సిపల్ కార్పొరేషన్ 43వ డివిజన్ ఊర్మిళానగర్కు ఆనుకునే ఉంది. దీన్ని అటు రామరాజ్యనగర్ ఇటు ఊర్మిళానగర్ ప్రజలు వినియోగించుకుంటున్నారు. వరద నీటి ముంపులో బాధితులు పది రోజులకుపైగా ఉండటంతో అనేక మందికి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

ఈ ప్రాంతంలో నివసించేవారిలో అధిక భాగం ముఠా పని, రోజువారీ పనులు చేసుకునేవారు కావడంతో ప్రైవేట్ హాస్పటల్స్కు వెళ్లి చూపించుకునే ఆర్థిక స్థోమత లేదు. ఈ నేపథ్యంలో వరద ప్రభావంతో కలిగే అంటు రోగ సమస్యలకు మందులు వాడదామంటే దగ్గరలో ఉన్న హెల్త్ క్లినిక్ మునిగిపోయి మూత బడటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి దీన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

ప్రతి ఇంటా కన్నీరే..

వన్టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో 33 డివిజన్లను ముంచిన వరద నీరు వేలాది మంది జీవితాలను ఛిన్నాభిన్నం చేసింది. ప్రతి ఇంటా కన్నీటినే మిగిల్చింది. ప్రధానంగా నగర శివారు ప్రాంతాల్లో బుడమేరు ప్రవాహం వేలాది ఇళ్లను ముంచేసి ముందుకు సాగిపోయింది. ఒకటి కాదు రెండు కాదు మొత్తం వారం రోజులకు పైగా నగరంలో తిష్ట వేసిన వరదనీరు మురుగునీరుగా మారి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. ఆ నీరు ఉన్నంత వరకూ ఒక కష్టమైతే నీరు వెళ్లిన తర్వాత అసలు కష్టాలు, ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

పాడైన వస్తువులతో రోదిస్తున్న ప్రజానీకం

ఇళ్లలో నీట మునిగిన వస్తువులను చూసి ప్రజలు రోదిస్తున్నారు. పాడైన వస్తువులను బయటకు తీసి శుభ్రం చేసుకుంటున్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు పనికివస్తాయో రావోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా వస్తున్న ఎండతో ఇంట్లో దుస్తులను ఉతికి పనికి వచ్చేవి ఉంచుకుంటున్నారు. మిగిలిన పారేస్తున్నారు. ప్రధానంగా ప్రతి ఇంట్లో పరుపులు పూర్తిగా ధ్వంసం కావడంతో ఏ చెత్తకుప్ప చూసినా నానిపోయి నాశనమైన పరుపులే దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం ద్విచక్ర వాహనాల ఇన్సూరెన్స్ గురించి చాలా మాటాలు చెబుతున్నా వాస్తవ రూపంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని నష్టం నమోదు వంటి బృందాలు తమ వద్దకు పూర్తి స్థాయిలో రాలేదంటూ కొంతమంది చెబుతున్నారు.



కేఎల్రావు నగర్లో ఇంటి ముందు ఆరబెట్టుకున్న వస్తువులు, దుస్తులు

భరించలేని దుర్వాసన



వించిపేట(విజయవాడపశ్చిమ): వరద తగ్గుముఖం పట్టినా పాత ఆర్ఆర్పేట వాసులకు మురుగు కష్టాలు తప్పడం లేదు. మహంకాళమ్మ గుడి వీధి, బీరువాల కంపెనీ రోడ్డు, సాయిబాబాగుడి వీధి, జేపీ టవర్స్ రోడ్డు తదితర ప్రాంతాలలో ఏ వీధి చూసినా వ్యర్థాలు నిండిపోయి దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఇంట్లో సామగ్రి వరద నీటిలో మునగడంతో చాలా వరకు ఎందుకు పనికి రాకుండా పోయాయి.

వ్యాధులు ప్రబలుతాయని భయంగా ఉంది



రోజుల తరబడి ఇళ్లముందు పేరుకుపోయిన వ్యర్థాలతో ఎక్కడ అంటువ్యాధులు ప్రబలుతాయోనని భయంగా ఉంది. పదిహేను రోజులుగా వరద నీటిలో పూర్తిగా సర్వం కోల్పోయి రోడ్డున పడ్డాం. వరద తగ్గిందని ఇంటికి వస్తే వ్యర్థాలు, మురుగు, దుర్వాసనతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. అధికారులు స్పందించి మా వీధిలో పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలి.

– పోలకి శారద, పాత ఆర్ఆర్పేట

నష్టాన్ని స్వయంగా పరిశీలించండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): వరదల కారణంగా రాష్ట్రంలో పలు ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, స్వయంగా పర్యటించి వరద నష్టాన్ని పరిశీలించి రాష్ట్రానికి తగిన సహాయం చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్కు విన్నవిస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ శుక్రవారం లేఖ రాశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏపీలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఎన్టీఆర్ జిల్లాల్లోని పలు ప్రాంతాలలో లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని పేర్కొన్నారు. వేల ఎకరాల పంట నీట మునిగిందని, వందల కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయని తెలిపారు.

శ్రీ వాంఛకల్ప గణపతియే నమః

వన్టౌన్(విజయవాడపశ్చిమ): వన్టౌన్లోని శ్రీ బాలగణపతి స్వామి శ్రీ వాంఛకల్ప గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాతబస్తీ పూజారి వారి వీధిలోని శ్రీ బాలగణపతి ఆలయంలో స్వామి వారి వినాయకచవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా స్వామి వారి సన్నిధిలో శుక్రవారం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. స్వామి వారి వాహనసేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవాయిద్యాలు, స్వామి వారి నామకీర్తనలతో వాహన సేవ జరిగింది. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి లక్ష్మీ వెంకటకృష్ణారావు పర్యవేక్షించారు.

లక్ష కుంకుమార్చన

మధ్యాహ్నం అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుమారు నాలుగు వందల మంది మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. సాయంత్రం మణిదీప వర్ణన పారాయణం చేశారు. -సమాజంలో ఆధ్యాత్మికత చింతన శాంతిని కలిగిస్తుందని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. 52వ డివిజన్ మల్లికార్జునపేటలోని బాలగణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో వినాయకచవితి వేడుకలను పురస్కరించుకొని అన్నదానం చేవారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి గౌరి, పైడి కృష్ణ, తణుకు శంకర్నాయుడు, రౌతు సాంబ పాల్గొన్నారు.



శ్రీ వాంఛకల్పలతా గణపతిగా బాలగణపతి



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న షేక్ ఆసిఫ్

విద్యాశాఖ కార్యాలయం వద్ద మినిస్టీరియల్ సిబ్బంది నిరసన

వన్టౌన్(విజయవాడపశ్చిమ): కడప జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మినిస్టీరియల్ సిబ్బందిపై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని ఎన్టీఆర్ జిల్లా మినిస్టీరియల్ స్టాఫ్ నేతలు డిమాండ్ చేశారు. దానికి నిరసనగా ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద సిబ్బంది నిరసన తెలిపారు.

విశ్వకర్మ జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

ఆటోనగర్(విజయవాడతూర్పు): విశ్వకర్మ జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని ఏపీ రాష్ట్ర కార్పెంటర్స్ (వడ్రంగి) అసోసియేషన్ అధ్యక్షుడు తాటికొండ రంగబాబు ప్రభుత్వాన్ని శుక్రవారం కోరారు. సకల సృష్టి కర్త భగవాన్ విశ్వకర్మ జయంతిని 10 ఏళ్లుగా కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ నిర్వహిస్తున్నారని, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కూడా ఘనంగా నిర్వహించిందని గుర్తుచేశారు. దీనికి సంబంధించిన జీవోను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

120 మంది నాయీ బ్రాహ్మణులకు వృత్తి పరికరాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వరద ముంపు ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన నాయీ బ్రాహ్మణులకు ఆ సంఘ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సర్వీసెస్(న్యూస్) శుక్రవారం వృత్తి పరికరాలను పంపిణీ చేసింది. భీమన వారి పేటలోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎం. రవీంద్రనాథ్బాబు విచ్చేశారు. సుమారు 120 మందికి వృత్తికి సంబంధించిన పరికరాలను అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. బుడమేరు వరద నేపథ్యంలో విజయవాడ పరిసరాల్లోని అనేక మంది చిన్న చిన్న వృత్తిదారులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకోవడం తమ వంతు బాధ్యతగా భావించామని తెలిపారు. మెడికల్ ఎంప్లాయిమెంట్ బోర్డు సెక్రటరీ మునుగోటి శ్రీనివాసరావు, అధ్యక్ష, కార్యదర్శులు మల్కాపురం కనకారావు, అన్నవరపు బ్రహ్మయ్య, కోశాధికారి జి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నాయీ బ్రాహ్మణులకు వృత్తి పరికరాలను అందజేస్తున్న రవీంద్రనాథ్బాబు

అనుబంధం.. ఆత్మీయత..



గ్రాండ్ పేరెంట్స్తో చిన్నారులు

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక శివాలయం రోడ్డులోని నెల్లూరి రవీంద్రభారతి భవానీపురం బ్రాంచ్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన గ్రాండ్ పేరెంట్స్ వేడుకలు ఆత్మీయత, ఆప్యాయతల నడుమ ఘనంగా జరిగాయి. నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులు తమ అమ్మమ్మ-నాయనమ్మలు, తాతలతో ఉన్న బంధాలు - అనుబంధాలపై వచ్చీరాని మాటలతో చెప్పారు. గ్రాండ్ పేరెంట్స్కూడా తమతమ మనుమలు, మనుమరాళ్లతో ఉన్న అవినాభావ సంబంధాలను తెలియజేశారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు గీతాలు ఆలపించి, డ్యాన్స్ చేసి గ్రాండ్ పేరెంట్స్ ముందు తమ ప్రతిభను చాటుకున్నారు. గ్రాండ్ పేరెంట్స్కు కూడా కొన్ని గేమ్స్ నిర్వహించారు. అనంతరం చిన్నారులు గ్రాండ్ పేరెంట్స్ పాదాలను కడిగి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల జోనల్ ఇన్చార్జ్ శివారెడ్డి, ఏజీఎమ్ కేశవరాజు,డీన్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ రాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదేళ్ల కష్టార్జితం వరదపాలు

- ఆకలిదప్పలతో అలమటిస్తున్నాం
- ఓట్ల కోసం ఇంటింటికీ వచ్చిన వారు ఇప్పుడు ఏమయ్యారు?
- కన్నీటి పర్యంతమవుతున్న బొమ్మసాని సుబ్బారావునగర్ బాధితులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పదేళ్ల కష్టార్జితం వరదపాలైందని బొమ్మసాని సుబ్బారావునగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుడమేరు వరదల నాటి నుంచి ఇప్పటి వరకు ఇళ్లలోనే నీళ్లు అలాగే ఉన్నాయి. మూట కట్టి పెట్టిన పళ్లాలు, గ్లాసులు, వంట సామాన్లు బురద కొట్టుకుపోగా వాటిని వరద నీటితోనే శుభ్రం చేసుకుంటున్నారు. బురద కొట్టుకుపోయిన దుస్తులను కూడా ఆ నీళ్లతోనే ఉతుక్కుంటున్నారు. వంట చేసుకుందామన్నా గ్యాస్ సిలిండర్, స్టౌ కొట్టుకుపోయాయి. ప్రభుత్వం నుంచి ఇంత వరకు ఎటువంటి సాయం అందలేదు. ఇది ఎక్కడో నగర శివారులో లేదు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఊర్మిళానగర్ మెయిన్ రోడ్ చివర కబేళా వైపుకు వెళ్లే మలుపు పక్కనే గొల్లపూడి పంచాయతీ పరిధిలో ఉంది. రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదల ఇళ్లు వరద ముంపు బారిన పడటంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది.



వరద నీటి ముంపులోనే బొమ్మసాని సుబ్బారావునగర్

అల్లాడుతున్నాం



కూలీనాలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూనే రూపాయి రూపాయి దాచుకుని అవసరమైన విలువైన వస్తువులను కొనుక్కున్నాం. వరద వస్తుందన్న సమాచారం ప్రభుత్వానికి ముందే తెలిసినా అప్రమత్తం చేయక పోవడంతో పదేళ్ల రెక్కల కష్టం వరద నీటి పాలయ్యింది. తింటానికి తిండి, తాగేందుకు మంచి నీళ్లు లేక అల్లాడిపోతున్నాం. బాధితులకు సాయం అందించి ఆదుకుంటాం అని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నా అసలైన మా లాంటి బాధితులకు అందడం లేదు.

– లక్ష్మి, బొమ్మసాని సుబ్బారావునగర్

ఆ నాయకులు ఏమయ్యారో!



మొన్న ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఇంటింటికీ వచ్చిన రాజకీయ నాయకులు ఇప్పుడు ఏమయ్యారు. వరద నీటి బారినపడి ఈ ప్రాంతం నిండా మునిగిపోయిన సంగతి వారికి తెలిసి కూడా రాలేదంటే ఓటుకు ఉన్న విలువ మనిషి ప్రాణానికి ఇవ్వలేదని అర్థమవుతోంది. వరద ముంపు నుంచి పనికి వెళ్లడం లేదు. వాటర్ ట్యాంక్ వచ్చినా రోడ్డులో కొంత వరకే వచ్చి వెళిపోతున్నారు. దాదాపు 30కిపైగా కుటుంబాలకు సాయం అందడం లేదు.

– రజిత, బొమ్మసాని సుబ్బారావునగర్

అన్నం అడిగితే ఉప్మా తింటావా అన్నారు



ఇల్లు చూస్తే వరద నీటితో మునిగి పోయింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటకు వెళ్లిపోయాం. వరద తగ్గు ముఖం పట్టాక ఇంటికి వచ్చాం. గర్భిణితో ఉండి ఆకలి తాళలేక సచివాలయానికి వెళ్లి అన్నం అడిగితే ఉప్మా చాలా ఉంది తింటావా అని వెటకారంగా మాట్లాడారు. మంచి నీళ్లు అడిగితే విసుక్కుంటున్నారు. కడుపులో బిడ్డ లేకపోతే పస్తులు ఉండగలను. మంచం నీటిలో మునిగిపోయింది. కింద పడుకుందామంటే వరద నీటితోపాటు విషపురుగులు, పాములు వస్తాయేమోనన్న భయం.

– తాటి లక్ష్మి, బొమ్మసాని సుబ్బారావునగర్

ప్రజలకు అందించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): అన్న క్యాంటీన్ల ఆహారాన్ని బుడమేరు వరద ముంపు ప్రాంతాల ప్రజలకు అందించాలని విద్యాధరపురానికి చెందిన సామాజికవేత్త వీరంకి రామచంద్రరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఊర్మిళానగర్, కబేళా, అజిత్సింగ్నగర్, పాయకాపురం, కండ్రిక తదితర ప్రాంతాల్లో ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.